క్లుప్తంగా

జాతీయ రహదారిపై ఆందోళన



ఆందోళన చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

భీమారం: మద్యం అక్రమ అమ్మకాలను అడ్డుకున్న కాంగ్రెస్ మహిళా నాయకురాలు రామిళ్ల రాధికను అరెస్ట్ చేసి జైలుకు పంపినందుకు నిరసనగా మంగళవారం మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహిళలు, నాయకులు ఆందోళన చేశారు. ప్రభుత్వ విధానాలు ఇలానే కొనసాగితే, పోరాటం మరింత ఉధృతం చేస్తామని మహిళలు హెచ్చరించారు. ఇందులో కాంగ్రెస్ నాయకులు గుడిమల్ల వెంకటేశ్, కోట రవి తదితరులు పాల్గొన్నారు.

గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

మంచిర్యాలటౌన్: గోవును కాపాడుకోవాలనే ఉద్దేశంతో ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడు 1977లో ది ఏపీ ప్రొహిబిషన్ ఆఫ్ కౌ స్లాటర్ అండ్ అనిమల్ ప్రిజర్వేషన్ యాక్ట్ 1977ను అమల్లోకి తెచ్చిందని, గోరక్ష కోసం దీనిని ఏర్పాటు చేశారని, ఈ చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ భారతీయ గో వంశ రక్షణ సంవర్ధన పరిషత్ సభ్యులు మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చట్టాన్ని ఉల్లంఘించి గోసంతతిని అక్రమంగా రవాణా చేస్తున్నారని, ఆటోలు, లారీల్లో, కంటైనర్లలో ఇరుకుగా ఉంచి రవాణా చేస్తున్నారన్నారు. చట్టాన్ని అమలు చేసి, గోవధకు కారణమవుతున్న వారిని కఠినంగా శిక్షించి, గోసంతతిని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో కర్ణకంటి రవీందర్, కొట్టె నటేశ్వర్, పద్మసందేశ్ గుప్త, శ్రీధర్, పడమంటి రవి, దొంతుల రవి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో వైద్యులు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని 2వ వార్డు దొరగారి పల్లెలో మంగళవారం వార్డు కౌన్సిలర్ సల్ల మహేశ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కరీంనగర్‌కు చెందిన మెడికవర్ ఆసుపత్రి వైద్యులు 150మందికి పైగా కాలనీవారికి గుండెకు సంబంధించిన ఈసీజీ, 2డి ఎకో, రక్తపరీక్షలను నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో వైద్యుడు మధన్, స్థానికులు బలిజెపల్లి తిరుపతి, ఓదెలు, జుమ్మిడి రాజం, పత్తి తిరుపతి, నాగరాజు, ప్రశాంత్, రోహిత్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



కాజిపల్లిలో క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

భీమారం: మండలంలోని కాజిపల్లి గ్రామంలో గొర్రెలు, మేకలు పెంపకం దారుల సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు మంగళవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వానాకాలం పంట సాగు కోసం రైతుబంధు సాయం అందించడం, ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఇందులో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్‌తోపాటు మహిళలు, రైతులు పాల్గొన్నారు.

కిష్టంపేటలో 'గడపగడపకూ కాంగ్రెస్'



ప్రజలతో మాట్లాడుతున్న రమేశ్

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ఎస్సీ కాలనీలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ గడపగడపకూ పాదయాత్ర కార్యక్రమం చేపట్టారు. చెన్నూర్ నియోజకవర్గ పీసీసీ సభ్యుడు నూకల రమేష్ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టగా గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



లక్సెట్టిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రి భవనం

ప్రసూతి కష్టాలు

- వెంటాడుతున్న సిబ్బంది కొరత.. సౌకర్యాల లేమి
- పీహెచ్‌సీలో ఆరు నెలల్లో ఆరు మాత్రమే డెలివరీలు
- రేకుల షెడ్డులో కొనసాగుతున్న సివిల్ ఆస్పత్రి
- గత్యంతరం లేక ప్రైవేట్ ఆస్పత్రులకు గర్భిణులు



వెంకట్రావుపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

లక్సెట్టిపేట: మండలంలోని వెంకట్రావ్‌పేటలో 2004లో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సరిపడా సిబ్బంది, సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జ్వరం, తలనొప్పి వంటి చిన్న వ్యాదులకు మాత్రమే మందులు పంపిణీ చేస్తూ కాలం వెల్లదీస్తున్నారు. పీహెచ్‌సీల్లో ప్రసూతి శాతం పెరగాలని ప్రభుత్వం ప్రత్యేక స్కీంలు తీసుకొస్తున్నా, సౌకర్యాల లేమితో అది సాధ్యం కావడం లేదు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి పక్కా భవనం మంజూరు కావడంతో పనులు కొనసాగుతుండగా, ప్రస్తుతం పాత ఎంపీడీవో కార్యాలయంలో ఆసుపత్రిని కొనసాగిస్తున్నారు. అక్కడ కూడా ప్రసూతీలపై అదే పరిస్థితి నెలకొంది. దీంతో గర్భిణులు ప్రసూతి కోసం లక్సెట్టిపేట, మంచిర్యాల, జగిత్యాలల్లోని ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి వేలకువేలు ఖర్చు చేసుకుంటున్నారు. ఇదే అదునుగా భావించిన ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యం, సిజేరియన్‌లు చేస్తూ లక్షలు గడిస్తున్నారు.

సివిల్ ఆసుపత్రిదీ అదే పరిస్థితి..

ప్రభుత్వ ఆసుపత్రికి నూతన భవనం మంజూరు కావడంతో పక్కా భవనానికి పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ఆసుపత్రిని పాత రేకుల షెడ్డులో నిర్వహిస్తుండడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రసూతి చేసేందుకు ప్రభుత్వం గతంలో నలుగురు మిడ్ వైఫరీలను నియమించినా, ప్రస్తుతం వారిని ఇతర ప్రదేశాలకు పంపించడంతో ప్రసూతీ సేవలు అందడం లేవు. డీజీవో, ఆపరేషన్ థియేటర్, లేబర్ గది, ఇతర సౌకర్యాలు లేకపోవడంతో వైద్యులు ప్రసూతీలు చేయడం లేదని వాపోతున్నారు. జనవరి నెల నుంచి ఇప్పటి వరకు కేవలం పదమూడు ప్రసూతి కేసులు నమోదైనట్లు తెలిపారు. సంబంధిత అధికారులు పట్టించుకుని సివిల్ ఆసుపత్రి, పీహెచ్‌సీల సమస్యలపై దృష్టి సారించి సౌకర్యాలు, సిబ్బంది కొరతను తీర్చాలని పలువురు కోరుతున్నారు.

ఆరు నెలల్లో.. ఆరు కేసులు..

వెంకట్రావుపేట పీహెచ్‌సీ పరిధిలో తొమ్మిది సబ్ సెంటర్లు, 18 గ్రామాలున్నాయి. ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు గర్భిణీ మొదటి నెల నుంచి అన్ని రకాల పోషక పదార్థాలను అందిస్తున్నప్పటికీ, గర్భిణులు చివరి డెలివరీ సమయంలో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రతి నెలా సుమారు ముప్పై నుంచి నలభై వరకు ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రసూతి అవుతున్నట్లు తెలుస్తోంది. పీహెచ్‌సీలో ఆరు నెలల నుంచి ఇప్పటి వరకు కేవలం ఆరు డెలివరీ కేసులు మాత్రమే నమోదైనట్లు వైద్యులు తెలిపారు. మందులు పంపిణీ చేసి, ల్యాబ్‌లు, సౌకర్యాలు కల్పించినా డీజీవో, ఆపరేషన్ థియేటర్ లేకపోవడంతో డెలివరీకి ప్రైవేటు ఆసుపత్రిని ఆశ్రయిస్తున్నారు. ల్యాబ్ టెక్నీషియన్, సబ్ సెంటర్‌లో ముగ్గురు ఏఎన్‌ఎంలు, ఒక వైద్యుడి కొరత ఉంది. గర్భిణులకు అవగాహన కల్పించాల్సిన అధికారులు, పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

సిబ్బంది కొరత తీర్చాలి



ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది కొరతను తీర్చాలి. డీజీవో అందుబాటులో లేకపోవడంతో డెలివరీలకు ఇబ్బంది అవుతోంది. ప్రస్తుతం ఆరు ప్రసూతీ కేసులు చేశాం. గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసూతి కోసం ముందుకు రావాలి. ప్రభుత్వాసుపత్రి సేవలను వినియోగించుకోవాలి. – సతీష్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారి, వెంకట్రావుపేట

సౌకర్యాలు కల్పించాలి



ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది, సౌకర్యాల కొరత ఉంది. ఇక్కడ డీజీవో, ఆపరేషన్ థియేటర్ లేకపోవడంతో ప్రసూతి చేయలేకపోతున్నాం. సౌకర్యాలు సరిగా లేవు. చాలా ఇబ్బంది అవుతోంది. సిబ్బందిని ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించాలి.– శ్రీనివాస్, సివిల్ ఆసుపత్రి సూపరింటెండెంట్, లక్సెట్టిపేట

సొంత వార్డునే అభివృద్ధి చేసుకోలేని ఎమ్మెల్యే

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్



నిలిచిన నీటిని పరిశీలిస్తున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: సొంత వార్డునే అభివృద్ధి చేసుకోలేని ఎమ్మెల్యే దివాకర్‌రావు, నియోజకవర్గానికి ఏం అభివృద్ధి చేస్తారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ ప్రశ్నించారు. దివాకర్‌రావు నివాసం ఉంటున్న 21వార్డు ఎల్‌ఐసీ కాలనీలో మహాజన్ సంపర్క్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మోదీ 9ఏళ్ల పాలనలో పేద ప్రజల కోసం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, సాధించిన విజయాలను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, పురుషోత్తం, రజనీశ్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

వేమనపల్లి: మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు మల్లేష్, శక్తి కేంద్రాల ఇన్‌చార్జి గణపురం సంతోష్ ఆధ్వర్యంలో మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కేంద్రం ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని వివరించారు.

తాండూర్: మండలంలోని ఐబీ ప్రాంతంలో గడపగడపకూ బీజేపీ కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి తొమ్మిదేళ్ల పాలనలో బీజేపీ అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను బీజేపీ శ్రేణులు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు మహీధర్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

'బీసీబంధు పేరుతో మోసం'

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలో మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం బీజేపీ ప్రవేశపెట్టిన పథకాలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ వివరించారు. రాష్ట్రంలో బలహీనవర్గాలకు బీసీ బంధు పేరుతో మోసం చేయడానికి ప్రణాళికలు రచించారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి బీఆర్‌ఎస్ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బేర రామన్న యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఆధ్వర్యంలో స్వచ్ఛ పక్వాడ



పిచ్చి మొక్కలు తొలగిస్తున్న సిబ్బంది

రామకృష్ణాపూర్: స్థానిక సింగరేణి సివిల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వచ్ఛ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఏపుగా మొలచిన పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో సివిల్ డీవైఎస్‌ఈలు జయప్రకాష్, శ్రీధర్, జేఈ దేవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

మందమర్రిరూరల్: సింగరేణి స్వచ్ఛ పక్వాడ కార్యక్రమంలో భాగంగా ఏరియాలోని సింగరేణి స్కూల్ విద్యార్థులకు మంగళవారం పరిసరాల పరిశుభ్రత, పర్యావరణం యొక్క ప్రాముఖ్యతపై వ్యాసరచన, డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం హెచ్‌ఎం సుందర్ స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

సర్వాయిపేటలో విగ్రహావిష్కరణ



పాల్గొన్న దీక్ష గురు ప్రేమ్‌సింగ్ మహారాజ్

కోటపల్లి: మండలంలోని సర్వాయిపేట గ్రామంలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సద్గురు ప్రేమ్‌సింగ్ మహారాజ్ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. శ్రీశ్రీ దీక్ష గురుప్రేమ్‌సింగ్ మహారాజ్ చే మహాబోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌సింగ్ మహారాజ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని అలవర్చుకోవాలని, ప్రశాంత జీవనం సాగించాలని సూచించారు. విద్యపై యువత దృష్టి సారించి, ఉన్నత స్థాయిలో ఉండాలని బాల్యవివాహాలు నిషేదం, మూఢనమ్మకాలను నమ్మకూడదని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వసంతకుమారి, నాయకులు సమ్మయ్యనాయక్, రవినాయక్, దేశీనాయక్, బాపు, బన్సీ, శ్రీధర్ పాల్గొన్నారు.

సమాచారం

నేడు పోచమ్మ బోనాలు

మంచిర్యాలఅర్బన్: స్థానిక హమాలీవాడ కట్టపోచమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 28న పోచమ్మ బోనాలు నిర్వహిస్తున్నట్లు నల్ల కోటమ్మ–లక్ష్మయ్య ట్రస్టు ఛైర్మన్ శంకర్ తెలిపారు. కార్యక్రమానికి జోగిని శ్యామల హాజరుకానున్నారని, భక్తులు హాజరుకావాలని కోరారు.

నేడు విప్ చేతుల మీదుగా చెక్కుల పంపిణీ

చెన్నూర్: మండలానికి చెందిన కల్యాణలక్ష్మి, షాదిముబారక్ లబ్ధిదారులకు బుధవారం మధ్యాహ్నం 12గంటలకు రామకృష్ణాపూర్‌లోని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ స్వగృహంలో విప్ చేతుల మీదుగా చెక్కులను అందజేయనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండే తెలిపారు.

పన్ను బకాయిలు 30లోగా చెల్లించాలి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను పన్ను బకాయి ఉన్నవారు ఈ నెల 30వ తేదీలోగా చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చెల్లించని వారికి జులై 1వ తేదీ నుంచి ఇంటి పన్నుపై 2శాతం ప్రతి నెలా వేయడం జరుగుతుందని, పట్టణ ప్రజలు వడ్డీ భారం పడకముందే ఇంటి పన్నులను చెల్లించాలని కోరారు. పన్నులను మున్సిపల్ ఆఫీస్ కౌంటర్‌లో గాని, ఏరియా బిల్ కలెక్టర్లు, వార్డు ఆర్పీలకు గాని చెల్లించి రశీదు పొందాలని, లేదా ఆన్‌లైన్‌లో https://cdma.cgg.gov.in/cdma_arbs/CDMA_PG/PTMenu ద్వారా చెల్లించి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

కాసిపేట మోడల్‌స్కూల్లో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

కాసిపేట: స్థానిక తెలంగాణ మోడల్‌స్కూల్ అండ్ కాలేజీలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఆఫ్‌లైన్ ద్వారా స్పాట్ అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు ప్రిన్సిపాల్ నాగమల్లయ్య తెలిపారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ ఫస్ట్ ఇయర్‌లో మిగిలి ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఈ నెల 30వ తేదీ వరకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కాలేజీలో సంప్రదించాల్సిందిగా సూచించారు. హాస్టల్ సౌకర్యం ఉందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

17వ సారి రక్తదానం

జన్నారం: ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసి స్నేహ యూత్ సభ్యులు ఆదుకుంటున్నారు. స్నేహ యూత్ ఉపాధ్యక్షుడు దుమల్ల రాజలింగు ఇప్పటి వరకు 16సార్లు ఇవ్వగా మంగళవారం 17వ సారి రక్తదానం చేసినట్లు అధ్యక్షుడు రమేశ్ తెలిపారు. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మి డెలివరీ చేయడానికి రక్తం సరిపడా లేదని వైద్యులు సూచించడంతో, కుటుంబీకులు స్నేహయూత్‌ను ఆశ్రయించారు. స్నేహయూత్ ఉపాధ్యక్షుడు రాజలింగు మంచిర్యాలకు వెళ్లి రక్తదానం చేసినట్లు రమేశ్ తెలిపారు.

పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

- జైపూర్ ఏసీపీ నరేందర్



జైపూర్‌లో మాట్లాడుతున్న ఏసీపీ నరేందర్



మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

జైపూర్: హిందు, ముస్లిం అనే భేదం లేకుండా అందరూ బక్రీద్, తొలి ఏకాదశి, భోనాల పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జైపూర్ ఏసీపీ నరేందర్ తెలిపారు. జైపూర్ పోలీస్‌స్టేషన్లో మంగళవారం ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో హిందు, ముస్లిం మతపెద్దలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పట్టణ, పల్లెప్రాంతాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా, మంచి వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని సూచించారు. గోవధ చేసినా, గోవులను అక్రమంగా రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కులాలకు అతీతంగా ఆనందోత్సవాలతో పండుగలను జరుపుకోవాలని సూచించారు. సమావేశంలో శ్రీరాంపూర్ సీఐ ముత్తులింగం, ఎస్సై ఉపేందర్‌రావు, హిందు, ముస్లిం మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

జన్నారం/తాండూర్/మందమర్రిరూరల్/లక్సెట్టిపేట/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/చెన్నూర్: తొలి ఏకాదశి, బక్రీద్ పండుగలను హిందువులు, ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని పోలీసులు సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీస్‌స్టేషన్‌లలో మంగళవారం పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించి ప్రజలకు, ప్రజాప్రతినిధులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పోలీసులకు సహకరించి నేరాల నియంత్రణ కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మందమర్రిలో సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై చంద్రకుమార్, దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు, సోమగూడెం ఎస్సై గంగారామ్, రామకృష్ణాపూర్ ఎస్సై అశోక్ పాల్గొనగా, జన్నారంలో ఎస్సై సతీశ్, లక్సెట్టిపేటలో ఎస్సై లక్ష్మణ్, హాజీపూర్‌లో ఎస్సై నరేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. తాండూర్‌లో నిర్వహించిన సమావేశంలో మాదారం, భీమిని, కన్నెపల్లి ఎస్సైలు రాజశేఖర్, మహేందర్, నరేష్, తాండూర్ రెండో ఎస్సై మధుసూధన్ చారి, చెన్నూర్ పోలీసుస్టేషన్‌లో కోటపల్లి సీఐ విద్యాసాగర్, ఎస్సై చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు

- బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్



మాట్లాడుతున్న శ్రావణ్

బెల్లంపల్లి: తమపై తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ హెచ్చరించారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్నేళ్ల క్రితం నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్ పక్కన ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల భవనాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ఆక్రమణ కోసం కూల్చి వేయించారని తమపై ఉద్దేశ పూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఆ ఆరోపణల్లో ఏ మాత్రం నిజం లేదని ఆయన ఖండించారు. శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనాన్ని బస్తీ వాసుల ప్రయోజనాల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ఆ స్థలాన్ని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశామన్నారు. కానీ ఆ స్థలాన్ని గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రవీణ్, శ్రావణ్ కలిసి కబ్జా చేస్తున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్వీ శ్రేణులు అరుణ్, యూనస్, చాణక్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



లక్సెట్టిపేట: ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

జన్నారం: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జన్నారం మండలంలోని 12పాఠశాలల విద్యార్థులకు మంగళవారం 'ఆర్థిక విద్య' అనే అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. బాదంపల్లి గ్రామ ఉన్నత పాఠశాలల విద్యార్థులు మొదటి బహుమతి గెలుచుకున్నారు.

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఎంఈవో రవీందర్ విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. క్విజ్ పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన వెంకట్రావుపేట పాఠశాల విద్యార్థులు సాత్విక్, అంజలికి ప్రథమ బహుమతి అందజేశారు.

దండేపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. బ్యాంకు వ్యవస్థ, ఆర్థిక రంగం అనే అంశాలపై రాతపూర్వక క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో వెల్గనూర్ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచింది.

తాండూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యతపై తాండూర్, భీమిని మండలాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో భీమిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు.

నెన్నెల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెన్నెల, కన్నెపల్లి మండలాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రిజర్వు బ్యాంకు ఇండియా సూచనల మేరకు 'బ్యాంకు సేవలు, ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీలు నిర్వహించి నగదును అందజేశారు. మండల స్థాయిలో ప్రథమ బహుమతి గెలుపొందిన మైలారం విద్యార్థులు శివకుమార్, శ్రావణికి ప్రథమ బహుమతిగా రూ.5వేలు అందజేశారు.

చెన్నూర్: మండల స్థాయి అక్షరాస్యత అవగాహన (ఆర్బీఐ) పరీక్షలో చెన్నూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారని ఎంఈవో కొమ్మెర రాధాకృష్ణమూర్తి అన్నారు. ఎ.అక్షయ్‌కుమార్, ఎ.పవన్‌శాస్త్రి ప్రథమ స్థాయిలో నిలిచారని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

హరితహారం లక్ష్యం పూర్తి చేయాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని పంచాయతీల వారీగా ఇచ్చిన హరితహారం లక్ష్యాలను పూర్తి చేసేలా పంచాయతీ కార్యదర్శులు నిబద్ధతగా పని చేయాలని ఎంపీడీఓ అబ్దుల్‌హై అన్నారు. మండలంలోని ఎంపీపీ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఎఫ్ఏలు, టీఏలతో జరిగిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు తగిన ఏర్పాట్లు చేసుకుని సిద్ధంగా ఉండాలన్నారు. ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, ఈజీఎస్ ఏపీఓ మల్లయ్య పాల్గొన్నారు.

సమీక్ష సమావేశం

చెన్నూర్‌రూరల్: మండలంలో పలు గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు కాగా మంగళవారం చెన్నూర్‌లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయా పంచాయతీల సర్పంచులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. భవన నిర్మాణాలకు ప్రభుత్వ స్థలం కేటాయించడం, వివిధ అంశాలపై చర్చించారు.

స్థల పత్రాల అప్పగింత

భీమిని: కన్నెపల్లి మండలంలోని గొల్లగట్టు, మాడవెల్లి, పోలంపల్లి, జజ్జరవెల్లి గ్రామపంచాయతీల్లో నూతన గ్రామపంచాయతీ భవనాలు మంజూరైనందున మంగళవారం తహసీల్దార్ రాంచందర్, ఎంపీడీఓ రాధాకిషన్ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు స్థల పత్రాలు అందజేశారు.

భూమిపూజ

వేమనపల్లి: మండల కేంద్రంతో పాటు రాజారాం గ్రామాల్లో ఉపాధిహామీ నిధులతో మంజూరైన గ్రామపంచాయతీ భవనాలకు సర్పంచ్ మధుకర్, ఎంపీఓ బాపురావు భూమిపూజ చేశారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

లక్సెట్టిపేట: మండలంలోని తిమ్మాపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు యువభారత్ శక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుస్తకాలను పంపిణీ చేశారు.

ఎరువుల దుకాణాల తనిఖీలు

నెన్నెల: మండల కేంద్రంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను మంగళవారం భీమిని వ్యవసాయ డివిజన్ ఏడీఏ ఇంతియాజ్ అహ్మద్ తనిఖీ చేశారు.

'దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి'

పాతమంచిర్యాల: నాగర్ కర్నూల్‌లో తెలంగాణ రజకవృత్తిదారుల సంఘం నాయకుడు శ్రీనివాస్‌పై దాడి చేసిన పెత్తందారులపై చర్యలు తీసుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, కార్యదర్శి రాములు ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.